తవ్వుకున్నవారికి.. తవ్వుకున్నంత...

- యథేచ్ఛగా సముద్రపు ఇసుక అక్రమ రవాణా
- అధికారుల అండతో సాగుతున్న దందా



ఎస్.రామేశ్వరం తీర ప్రాంతంలో ఇసుకను తవ్వేసిన దృశ్యం

అల్లవరం: ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుకకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఇదే అదనుగా తీసుకుంటున్న అక్రమార్కులు ఏకంగా సముద్రపు ఇసుకను తవ్వేసి తీసుకెళ్లి అమ్మేస్తూ అమాయక ప్రజలకు అంటగట్టేస్తున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా తవ్వకాలు, అక్రమ రవాణా సాగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు అసలేమీ జరగనట్టు, తమకేమీ తెలియనట్టు వదిలేయడంతో ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సముద్రపు ఇసుకతో ఇళ్లు నిర్మిస్తే ఆ భవనాలు ఎక్కువ కాలం నిలబడవని సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మండలంలోని ఎస్.రామేశ్వరం, కొమరగిరిపట్నం, ఓడలరేవు గ్రామాల్లో విస్తరించి ఉన్న తీర ప్రాంతం ఇసుకాసురుల పాలిట కామధేనువుగా మారింది. ఎన్నో ఏళ్ల క్రితం సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. రాత్రి పగలన్న తేడా లేకుండా అడ్డూఅదుపూ సముద్రపు ఇసుకని తవ్వేసి రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తీరం పొడవునా సరుగుడు తోటల్లోని దిండు ఇసుకని గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఒక చోట నుంచి మరో చోటకి డంప్ చేసి అక్కడి నుంచి జేసీబీల సాయంతో ట్రాక్టర్లపై లోడ్ చేసి తరలిస్తున్నారు. యూనిట్ ఇసుక ధర రూ.1,500 నుంచి రూ.2,200 వరకూ అమ్మి సొమ్ములు చేసుకుంటున్నారు.

అధికారులే అండగా ఉంటే

అక్రమ ఇసుక రవాణాతో ఓడలరేవు, కొమరగిరిపట్నం గ్రామాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలను దాదాపుగా 80 శాతం వరకూ తవ్వేశారు. ఇప్పుడు ఎస్.రామేశ్వరం తీరంలోని ఇసుక దిబ్బలపై ఇసుకాసురుల కన్ను పడింది. సరుగుడు తోటలు, తీరాన్ని ఆనుకుని ఉన్న ఇసుకని తరలించేస్తున్నారు. ఎస్.రామేశ్వరంలో ఓ వ్యక్తి భారీ స్థాయిలో అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ అధికారులు కనీసం కన్నెత్తి అయినా చూడడం లేదు. గత కొంత కాలంగా సముద్రపు ఇసుకని తరలిస్తున్నా వీఆర్‌ఓలు అక్రమ ఇసుకని నిలువరించిన దాఖలాలు లేవు. పరోక్షంగా రెవెన్యూ అధికారులే అక్రమ ఇసుక తరలింపునకు సహకరిస్తున్నారన్న చర్చ సర్వత్రా సాగుతోంది. వీఆర్‌ఓల కనుసన్నల్లోనే ఇసుక దందా సాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ ఇసుకని నిలువరించకపోతే తీర ప్రాంత ప్రజలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సునీల్‌కుమార్‌ని వివరణ కోరగా ఇసుక అక్రమ రవాణా జరిగితే సహించేది లేదన్నారు. అనుమతులు లేకుండా ఇసుకని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై వీఆర్‌ఓలను పంపి పరిశీలన చేయిస్తానని తెలిపారు.

క్లుప్తంగా

నేడు పాత కోరంగిలో ఉచిత హోమియో వైద్య శిబిరం

తాళ్లరేవు: మండలంలోని పాత కోరంగిలో కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ఎం.విజయ ప్రతిభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అన్ని రకాలైన దీర్ఘకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సాహూ మహరాజ్ జయంతి

ఉప్పలగుప్తం: ఛత్రపతి సాహూ మహరాజ్ 150వ జయంతి కార్యక్రమాన్ని మండలంలోని వానపల్లిపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అమలాపురం బీఎస్పీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు సాహూ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ భారతదేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన మొట్టమొదటి ఘనుడు ఛత్రపతి సాహూ మహరాజ్ అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, లక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్థానిక బల్ల గేటు సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. అన్నా క్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన మరమ్మతుల కోసం రూ.7,59,000తో అంచనాలు సిద్ధం చేశామని కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆయనకు తెలిపారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యం



నడిపూడిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని కావాలనే నిర్వీర్యం చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు అన్నారు. నడిపూడి తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. పొమ్మన లేక పొగబెట్టే చందంగా ఉపాధి హామీ పథకం నిధుల్లో కోత విధించి ఉపాధి కూలీలకు ఉపాధి పథకాన్ని దూరం చేస్తున్నారన్నారు. బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చుంటే ఉపాధి పథకాన్ని తొలగించేవారన్నారు. ఉపాధి కార్మికులకు పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలి రేట్లు రూ.600 చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా పాలమూరి శ్రీనివాస్ మెట్లు, కూలీలు పాల్గొన్నారు.

లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి

యానాం: పట్టణంలో లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికశాఖ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ గతంలో అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన దయానిధి మార్చి 15న పుదుచ్చేరి బదిలీపై వెళ్లారని అనంతరం ఆయన స్థానంలో వేరొక అధికారిని నియమించలేదన్నారు. గత మూడు నెలలుగా కార్మికశాఖలో అసిస్టెంట్ లేబర్ఇన్‌స్పెక్టర్ నియామకం జరగక వేలాదిమంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్‌ఏఓ మునిస్వామి స్పందించి నూతన అధికారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ కుంచే సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యబలిజ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న సంఘ నాయకులు

అమలాపురం టౌన్: పట్టణ సూర్య బలిజ సంఘం అధ్యక్షుడిగా భాస్కర్ల రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సూర్య బలిజపేటలో సంఘ నాయకుడు మద్దుల రవి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్ష పదవికి రామకృష్ణను ఎంపిక చేశారు. వారం రోజుల్లో మరో సమావేశాన్ని నిర్వహించి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు రవి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని సూర్య బలిజ అభ్యున్నతి కోసం కృషి చేస్తానని సంఘ నూతన అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. అనంతరం రామకృష్ణను సంఘీయులంతా ఘనంగా సత్కరించి అభినందించారు. సమావేశంలో మద్దుల గోపాలకృష్ణ, ధరణికోట శ్రీనివాసరావు, కాలే విశ్వనాథం, యండమూరి సత్తిబాబు, భాస్కర్ల లోవరాజు, పందిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోడసకుర్రులో ఉచిత వైద్య శిబిరం



ఉచిత మెగా వైద్య శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అల్లవరం: బోడసకుర్రు సచివాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి వారిచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోగులకు కంటి పరీక్షలతో పాటు షుగరు, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీవీఎస్ మల్లిబాబు, డాక్టర్ పీఎస్ శర్మ, కార్యదర్శి చిక్కాల సతీష్, గుమ్మళ్ల తాతయ్యకాపు, పట్నాల వెంకటరమణ, శిష్ఠ శ్రీహరి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



యానాంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ర్యాలీ



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసుల బైక్ ర్యాలీ



సుంకరపాలెంలో డ్రగ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ పోలీసులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

యానాం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ రాజశేఖరన్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసుల బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తుల ప్రభావానికి లోను కాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొదట్లో సరదాగా తీసుకున్న మత్తు పదార్థాలే మనిషిని బానిసగా మారుస్తాయన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా, కొనుగోలు చేస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానంద్, శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఎస్ఐ శేరు నూకరాజు ప్రారంభించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను నిర్వహించారు.

యాంటీ డ్రగ్స్ అవగాహనా ర్యాలీ

తాళ్లరేవు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సుంకరపాలెంలో విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాళ్లరేవు ఎస్ఐ టి.చిట్టిబాబు మాట్లాడుతూ జీవితాలను ఛిద్రం చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి జీవితాలు నాశనమవుతాయన్నారు. అనంతరం డ్రగ్స్ జోలికి పోమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దాం

అమలాపురం రూరల్: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దామని ఎస్పీ శ్రీధర్ అన్నారు. సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. యువత చెడు వ్యసనాల బాట పట్టకుండా మంచి అలవాట్లతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమరబాబు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ వై.శేఖర్‌బాబు, కిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం పంపిణీకి పచ్చజెండా



దరియాలతిప్పలో మూతపడ్డ రేషన్ దుకాణం

యానాం: నగదుకు బదులు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేయాలన్న పుదుచ్చేరి కేబినెట్ నిర్ణయంపై ఎల్జీ సీపీ రాధాకృష్ణన్ బుధవారం సానుకూలంగా స్పందించడంతో స్థానిక ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఐదేళ్ల తర్వాత రేషన్ దుకాణాలు మళ్లీ తెరుచుకోనున్నాయని సంతోషం వెలిబుచ్చుతున్నారు. గత ఐదేళ్లుగా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లో బియ్యానికి బదులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేస్తున్నారు. దీంతో పుదుచ్చేరివ్యాప్తంగా ఉన్న 430 రేషన్‌షాపులు మూసివేశారు. అయితే నగదు బదిలీ ద్వారా వచ్చే సొమ్ము బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలతో బియ్యం కొనుగోలుకు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత బియ్యం పంపిణీ చేయాలంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దీంతో రేషన్ దుకాణాల ద్వారా ఉచిత బియ్యం పంపిణీకి అనుమతి కోరుతూ సీఎం రంగసామి ఎల్జీకి పంపిన తాజా ప్రతిపాదనకు ఎల్జీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు.

సముద్రం అల్లకల్లోలం



ఓడలరేవు వద్ద అల్లకల్లోలంగా మారిన సముద్రం

అల్లవరం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్లవరం మండలం ఓడలరేవు వద్ద బుధవారం ఉదయం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం గ్రామాల్లోని తీరం పొడవునా భారీ కెరటాలతో తీరం కోతకు గురవుతోంది. బుధవారం సాయంత్రం మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు తమ బోటులకు ఓడలరేవు జెట్టీ వద్ద లంగర్ వేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని సాగులో అధిక దిగుబడులు సాధించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం యానాం వ్యవసాయశాఖ, రైతు సంక్షేమ భవనంలో రైతులకు పంట ప్రోత్సాహక నగదు పంపిణీ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వరి, అపరాలు, కొబ్బరి పండించే 331 మంది రైతులకు పంట ప్రోత్సాహక నగదు రూ.24,14,232 పుదుచ్చేరి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సదరు మొత్తం ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని చెప్పారు. యానాం లింకింగ్ చానల్ రెండో విడత పనులకు అంచనాలు సిద్ధం చేస్తున్నారన్నారు. దరియాలతిప్ప ఎస్సీ సొసైటీ భూములకు వరద రక్షణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏటిగట్టు మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జోగిరాజు, ఫీల్డ్‌మెన్‌లు కేవీ సుబ్బారావు, ఐకే ఖాన్, రైతులు పాల్గొన్నారు.

వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తనిఖీ



తాగునీటి నాణ్యతను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో డెంగీ, మలేరియా జ్వరాలు, డయేరియా వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో కమిషనర్ మనోహర్ పట్టణంలో ముందు జాగ్రత్త చర్యగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బుధవారం ఆయన పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరా, పారిశుధ్య విభాగాలను తనిఖీలు చేశారు. ఇంటింటికీ వెళ్లి తాగునీటి కుళాయిలను పరిశీలించారు. ముఖ్యంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వెళ్లి అక్కడ తాగునీటి నాణ్యతను పరీక్ష చేయించారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారమే తాగునీటి ట్రీట్‌మెంట్ జరుగుతోందని కమిషనర్ చెప్పారు. పలు ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు సూచించారు. చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. వైరల్ జ్వరాలు, డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే సొంత వైద్యాలు చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి వారు సిఫార్సు చేసిన మందులనే వాడాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా పరంగా మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

జీఎస్టీ అప్పీలేట్ బెంచ్ ఏర్పాటుకు నిర్ణయం

యానాం: పుదుచ్చేరిలో గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(జీఎస్టీఏటీ)సర్క్యూట్ బెంచ్ ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. ఇటీవలి న్యూఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారన్నారు. పైలెట్ ప్రాతిపదికన జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ ప్రామాణీకరణ అమలును సైతం కౌన్సిల్‌కు తాను తెలియజేశానన్నారు. ఇకపై చెన్నై జీఎస్టీ ట్రిబ్యునల్‌పై ఆధారపడకుండా వ్యాపారులు సరాసరి పుదుచ్చేరి బెంచ్‌ను ఆశ్రయించవచ్చన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే అన్నదాన పథకానికి రూ.10,116 విరాళం అందినట్టు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. పెనుగొండకు చెందిన నిట్టల శరత్ సంజయ్, ఇంద్రాణి దంపతులు విరాళం అందించినట్టు తెలిపారు. దాతలకు ఆయన చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

పి.గన్నవరం: ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సమాజం ఎన్నటికీ మరువదని, వారికి మంచి గుర్తింపు ఉంటుందని యూనియన్ బ్యాంక్ ఊడిమూడి, ముంగండ బ్రాంచి మేనేజర్లు అల్లు త్రినాథ్, కోట అశోక్ అన్నారు. పి.గన్నవరం బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్న కేటీ వెంకట నరసింహం ర్యాలి బ్రాంచికి సీనియర్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నరసింహంను స్థానిక బ్రాంచి కార్యాలయంలో బుధవారం సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. బీఎం నరసింహం మాట్లాడుతూ తనకు సహకరించిన బ్రాంచి సిబ్బందికి, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పి.గన్నవరం బ్రాంచి సబ్ మేనేజర్ సుమలత, ఆర్‌డీఓ సుభాష్, సాయిదీప్ శరత్, బొరుసు చంద్రశేఖర్, సుంకర శ్రీను, సూదా వీరభద్ర రావు, మామిళ్లపల్లి శ్రీనివాస్, అడ్డగళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

ముంపును తట్టుకునే వంగడాలను ఎంచుకోవాలి



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: రైతులు ఖరీఫ్ సాగులో ముంపును తట్టుకునే వరి వంగడాలను ఎంచుకోవాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ సూచించారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో ప్రయోగాత్మక పరిశీలన కోసం బుధవారం రైతులకు ముంపును తట్టుకునే వరి వంగడాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సాగులో ఎంటీయూ-1232 రకపు విత్తనాన్ని రైతులు ఉపయోగించుకోవాలని సూచించి వారికి అందజేశారు. ఈ విత్తనం 140 రోజుల కాలపరిమితిలో 30 నుంచి 35 బస్తాల దిగుబడి ఇస్తుందన్నారు. అగ్గితెగులు, పొడ తెగుళ్ల బారి నుంచి తట్టుకుని ముంపు సమయంలో రెండు వారాల పాటు పడిపోకుండా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలోని మినుము చేలను పరిశీలించి పైరు ఆశించిన ఆకు ముడత తెగుళ్లను నివారించడానికి లీటరు నీటిలో 20 మిల్లీ లీటర్ల క్లోరో పైరిఫాస్ మిశ్రమించి పిచకారీ చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం అమలాపురం సహాయ సంచాలకులు ఏవీఎస్ రాజశేఖర్, వ్యవసాయాధికారులు జి.కుమార్‌బాబు, జి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



అంబాజీపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్లు కిరణ్, వీరభద్రం

అంబాజీపేట: వరినారు వేసే సమయంలోనే నాణ్యమైన విత్తనాలు ఎంపిక వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని నూజివీడు సీడ్స్ కంపెనీ రీజనల్ మేనేజర్, టెరిటోరియల్ మేనేజర్ కిరణ్, వీరభద్రం అన్నారు. అంబాజీపేట ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో వరి సాగు చేపట్టే రైతులకు స్వర్ణ రకం విత్తనాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపద 9558, కన్స్ట్ ప్లస్ (సంపద గోల్డ్) 9381, పూర్ణిమ 210 రకాలతో వరి సాగు చేపట్టడం వల్ల వాతావరణానికి అనుగుణంగా పంట దిగుబడి వస్తుందన్నారు. పురుగులు, తెగుళ్ల బెడద నుండి ఈ మూడు రకాలు తట్టుకుంటాయన్నారు. గత ఏడాది ఈ మూడు పంటలు వేయడం వల్ల తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడులు సాధించిన రైతులు ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల డవలప్‌మెంట్ ఆఫీసర్ మట్టపర్తి వరుణ్‌కుమార్, దంగేటి వినయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించండి

సఖినేటిపల్లి: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌కు పంపాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి కోరారు. బుధవారం అప్పనరామునిలంకలో అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ ప్రీ స్కూల్స్‌లో మంచి వాతావరణంలో పిల్లలకు సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాలను నివారించాలి

అంబాజీపేట: మాతా,శిశు మరణాలు నివారించేందుకు ప్రతీ గ్రామంలోను అవగాహన కల్పించి చైతన్య పరచాలని జిల్లా స్టాటిస్టికల్ అధికారి ఎస్.వీరబాబు, డీపీవో రవిలు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం హెల్త్ సబ్ సెంటర్‌ను జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ స్త్రీలు, కౌమర దశలో ఉన్న బాలికలు రక్తహీనతకు గురికాకుండా వైద్య సలహాలు పాటించాలన్నారు. అనంతరం రక్తహీనతతో ఉన్న గర్భిణులు, బాలికలు తీసుకోవల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కలిపంచారు. అంతకుముందు ఎఎన్ఎం, ఆశా, ఎంఎల్‌హెచ్‌పీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డేటా మేనేజర్ కృష్ణ మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.